telugubooks

# అపాయంలో ఉపాయం

ఆహార పదార్థాల కోసం అలా అలా తిరిగి తన కన్నంలోకి దూరిన చిట్టెలుకని గమనించింది ఓ గండు పిల్లి. దాన్ని చటుక్కున చప్పరిస్తే ఎంత బావుంటుందో కదా అని ఆలోచించింది.

అందుకే ఆ కలుగు పక్కనే మాటువేసి ఆలోచించసాగింది. ఓ ఆలోచన వచ్చింది.

"ఎలుక అల్లుడూ.....ఎలుక అల్లుడూ...!" కన్నంలోకి చూస్తూ పిలిచింది.

"ఏమిటి పిల్లి మావా ?" లోపలి నుంచే అడిగింది ఎలుక.

"ఇలా తూర్పు దిక్కుకు కొద్దిగా ముందుకు పోతే వేరు శనగ చేను ఉంది. అక్కడ కాయలు ఎంత బావున్నాయనుకున్నావ్! రేపు ఉదయం అయిదు గంటలకి నువ్వు కూడా వస్తానంటే ఇద్దరం కలసి వెళ్దాం" అంది గండుపిల్లి.



ఆ వంకన తనని పిలిచి స్వాహా చేద్దామన్న దాని ఆలోచనని పసిగట్టేసింది ఎలుక. కాని బయట పడకుండా "అలాగే" అంది.

మరునాడు ఉదయం అయిదు గంటలకి పిల్లి వచ్చి ఎలుకని పిలిచింది."నేను నాలుగు గంటలకే వెళ్ళి సుష్ఠుగా తిని వచ్చాను." అని జవాబిచ్చింది ఎలుక.

గండుపిల్లి తన కోపాన్ని గొంతులోనే దిగమింగుకుంది. "సరే మంచిది. మరో మంచి పంటని ఇవాళ వస్తూ చూశాను. ఆ పొలం వేపు రేపు ఉదయం నాలుగు గంటలకి వెళ్దామా" అంది.

"అలాగే" అంది ఎలుక.

మరునాడు కూడా పిల్లి వచ్చే సరికే ఎలుక వెళ్ళి వచ్చేసింది. 'కాని ఈ పిల్లి తలనొప్పిని వదిలించుకోవడం ఎలా ?' అని ఆలోచించసాగింది.

రోజూ గండుపిల్లి కన్నా ముందే వెళ్ళి వేరుశనగ చేనుని కొరికి రాసాగింది ఎలుక.

తన పంటని నాశనం చేస్తున్న దెవరో తెలుసుకుందామని ఆ రోజు రైతు చెట్టు చాటున దాగి గమనించసాగాడు.

కావాలనే ఆ రోజు ఎలుక ఆలస్యం చేసింది. ముందు ఎలుక, వెనుక గండుపిల్లి పొలం వేపు బయల్దేరాయి.

తీరా వేరుశనగ పొలం దగ్గరికి వెళ్ళగానే ఓ కన్నంలోకి దూరి మాయమైంది ఎలుక. దాని కోసం వెదుకుతూ అటూ ఇటూ చూస్తున్న పిల్లిని గమనించాడు రైతు. 'ఇదే తన పొలాన్ని పాడు చేస్తోందని' అతను అనుకున్నాడు.

అంతే! అతని చేతిలో ఉన్న బడితెని పిల్లి మీదకి విసిరేశాడు. దాని వాతబడి పిల్లి చచ్చి పోయింది. నిశ్చింతంగా ఎలుక తన కలుగుకు వెళ్ళి పోయింది. ఉపాయంతో ఆలోచించి ఎంతటి అపాయం నుంచైనా బయట పడవచ్చు!